క్లుప్తంగా

డీజీపీని కలిసిన జిల్లా ఎస్పీ



డీజీపీ హరీష్‌కుమార్ గుప్తాకు మొక్కను అందజేస్తున్న జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప అర్బన్ : వైఎస్ఆర్ జిల్లా నూతన ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్ బుధవారం రాష్ట్ర పోలీస్ హెడ్ క్వార్టర్స్ కార్యాలయంలో రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్క ను అందచేశారు. ఈ సందర్భంగా డీజీపీ నూతన ఎస్పీకి శుభాకాంక్షలు తెలిపారు.

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జన వికాస్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎండీ తాహిర్ ఆధ్వర్యంలో రోగులకు బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తాహీర్ మాట్లాడుతూ జనవికాస్ సంస్థ ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పీవీ రమణ, శివ, గౌస్, ప్రతాప్, లోకేష్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కడపలో కళా ప్రదర్శన

కడప సెవెన్‌రోడ్స్ : కడప రాజీవ్ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి 8.30 గంటలకు సాయిపేటలో కళా ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందని ఆ క్లబ్ చైర్మన్ మందల మురళికృష్ణ తెలిపారు. బుధవారం ఒన్ టౌన్ సర్కిల్‌వద్దగల రాజీవ్ కల్చరల్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రదర్శనల్లో ముందుగా శ్రీకృష్ణ రాయబారం నాటకంలోని 'పడక సీను', చింతా మణి నాటకంలోని 'ఉంగరాల సీను, భవానీ సీను ,'సత్య హరిశ్చంద్ర' పూర్తి నాటకం ప్రదర్శించనున్నారన్నారు. ఈ సమావేశంలో నాటకాల గురువు ఎడవల్లి రామలింగం, ప్రదర్శనలు చేసే కళాకారులు, దాసరి సుధా కర్, వి ప్రకాశం, ఎం వెంకట సుబ్బయ్య, ప్రకాశం శర్మ బాల చెన్నయ్య, నర్సింహ్మలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : కడప రిమ్స్ వద్ద ఉన్న ప్రభుత్వ ఐటీఐ మైనారిటీస్‌లో 4వ విడత అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జ్ఞానకుమార్ తెలిపారు. పదవ తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన, ఇంటర్ ఫాస్ లేదా ఫెయిల్ అయిన అర్హత ఉన్న విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులు నేరుగా తమ 10వ తరగతి మార్కుల జాబితా, టిసి, కుల ధృవీకరణపత్రం, ఆధార్‌కార్డు, ఫోటో, మెయిల్ ఐడి, మొబైల్ నెంబర్ తీసుకుని ఐటిఐ వద్దకు వచ్చి ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా iti.a p.gov.i n అను పోర్టల్‌లో దరఖాస్తును సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు స్వయంగా కూడా దరఖాస్తును వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. రిజిస్టర్ చేసిన దరఖాస్తును తప్పని సరిగా వెరిఫికేషన్ చేయాలని తెలిపారు. ఐటిఐలో కంప్యూటర్స్(కోపా) కోర్సుకు 10వ తరగతి ఉత్తీర్ణత మరియు వెల్డర్ ట్రేడ్‌కు 10వ తరగతి ఫెయిల్ అయిన వారు కూడా అర్హులని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు ఈ నెల 27వ తేదీ లోగా దరఖాస్తు సమర్పించాలని తెలిపారు. 29వ తేదీ అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నామని తెలిపారు.

ఐఆర్ ప్రకటించాలి

కడప ఎడ్యుకేషన్ : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు దసరా కానుకగా ఈనెల 18న జరగబోయే ఆంధ్రప్రదేశ్ క్యాబినెట్ సమావేశంలో 30% ఐ.ఆర్ ప్రకటించాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ఏపీ జి ఈ ఎఫ్ రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి సుధా ఇలియాస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు డి రామాంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షులు పివి సుబ్బారెడ్డి, ఆర్థిక కార్యదర్శి భోగా వెంకట సుబ్బయ్యలు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే 12వ పీఆర్సీ ప్రకటిస్తామని, ఐ.ఆర్ ఇస్తామని, ఉద్యోగుల బకాయిలు అధికారంలోకి వచ్చిన వెంటనే చెల్లిస్తామని చెప్పారన్నారు. కానీ అధికారంలోకి వచ్చి 15 నెలలు దాటినా ఇప్పటి వరకు సంఘాలను పిలిచిన దాఖలాలు లేవన్నారు. సంబంధిత డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని వారు కోరారు.

20న జల్సా-యే-మిలాద్

కడప సెవెన్‌రోడ్స్ : ఏపీ ఉలామా అయిమ్మ కమిటీ ఆధ్వర్యంలో మహా ప్రవక్త మహమ్మద్ (సా.అ.వ) జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 20వ తేదీన కడపలోని అగాడిలోగల ఇనాయత్‌ఖాన్ తాలీమ్ మైదానంలో 18వ మర్కజీ జల్సా-యే-మిలాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాత్రి 9.00 గంటల నుంచి ప్రముఖ ముస్లిం మత గురువులు, ప్రముఖులు హజరత్ వలీవుల్లా హుసేనీ సాహెబ్, సయ్యద్ లియాఖత్ అలీ బాష సాహెబ్, సయ్యద్ ఇందాదుల్లా హుసేనీ సాహెబ్, సయ్యద్‌షా మహమ్మద్ అలీ బగ్‌దాది సాహెబ్, షేక్ మహమ్మద్ అక్బర్ అలీ సాహెబ్ రషాది, సయ్యద్‌షా ఫక్రుద్దీన్ హుసేనీ సాహెబ్, సయ్యద్‌షా మొహమ్మద్ అతీఫ్ అబ్రార్‌హుసేనీ అజ్‌హారి సాహెబ్‌తోపాటు ఇతర ప్రముఖులు, గురువులు మహా ప్రవక్త గురించి దివ్య సందేశాన్ని అందజేస్తారన్నారు. మహిళల కోసం ప్రత్యేక వసతి ఏర్పాట్లుచేశామన్నారు.

పాత బస్టాండు దుస్థితి ఇది



ఇది పల్లెటూరు బస్టాండు కాదు. కడప నగరంలోని పాత బస్టాండ్. నిత్యం వేలాది మంది వివిధ ప్రాంతాల నుంచి గ్రామాలకు వెళుతుంటారు. వానొస్తే ప్రయాణికుల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బస్టాండ్ ఆవరణంలో గతుకుల రోడ్డు తో పాటు మురికి నీటి గోతులు ఉండడంతో ప్రయాణికులు ఇక్కట్లు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు. మరి కొందరు కూటమి పాలన తీరును ఎండగడుతున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







అసత్య ఆరోపణలు చేయడం తగదు



మాట్లాడుతున్న 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుజాత, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సుబ్బరాయుడు

కడప కార్పొరేషన్ : కడప నగరం ఎర్రముక్కపల్లెలోని సీపీ బ్రౌన్ లైబ్రరీ ప్రక్కన లైబ్రరీ విస్తరణ పనులు చేసే కాంట్రాక్టర్ భవన నిర్మాణ కార్మికులకు సరైన వసతులు కల్పించకుండా తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని 21వ డివిజన్ కార్పొరేటర్ ఎం. సుజాత, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సుబ్బరాయుడు అన్నారు. బుధవారం సీపీ బ్రౌన్ లైబ్రరీ ప్రక్కన వారు మీడియాతో మాట్లాడుతూ తెలుగు భాషకు ఎంతో సేవ చేసిన సీపీ బ్రౌన్ స్మారకార్థం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ఆర్ ..సీపీ బ్రౌన్ లైబ్రరీని వైవీయూలో విలీనం చేశారని, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ లైబ్రరీని మరింత విస్తరించాలని సంకల్పించి 0.27 సెంట్ల స్థలాన్ని రూ.3కోట్లతో సేకరణ చేసి, మరో రూ.3.66కోట్లు మంజూరు చేసి భవనాల నిర్మాణానికి కృషి చేశారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేరున్న శిలాఫలకాన్ని అధికారులు దాచిపెట్టారని, అప్పట్లో దీనిపై తాము ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ భవనాలు నిర్మిస్తున్న కాంట్రాక్టర్ భవన నిర్మాణ కార్మికులకు సరైన వసతులు కల్పించకుండా.. ప్రక్కనున్న ఖాళీ స్థలంలో పూరి గుడిసెలు వేసి అందులో వారిని ఉంచారన్నారు. దీంతో వారు రోడ్ల పైన, బహిరంగ ప్రదేశాల్లో కాలకృత్యాలు తీర్చుకుంటూ, బట్టలు ఉతికి ఆరేసుకుంటూ ఉన్నారన్నారు. అక్కడ వాకింగ్ చేసే మహిళలకు, పిల్లలకు ఇది చాలా ఇబ్బందికరంగా పరిణమించిందన్నారు. దీనిపై తాము వైవీయూ అధికారులకు, ఖాళీ స్థలం ఓనర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. లే ఔట్‌లో మోటార్ పనిచేయకుండా పోవడానికి వారే కారణమన్నారు. వీటన్నింటి నుంచి ప్రక్కదారి పట్టించడానికే తాను రూ.6లక్షలు అడిగినట్లు పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారన్నారు. కార్పొరేటర్‌వి కదా నీవే పట్టించుకోకపోతే ఎలా అని స్థానికులంతా తమను అడుగుతుంటే దీనిపై నగరపాలక అధికారులకు ఫిర్యాదు చేశానే తప్పా ఎవరినీ డబ్బు అడగలేదన్నారు. తనపై బురదజల్లి అవాస్తవాలు ప్రచారం చేసిన వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ సమావేశంలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలను చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్ : కూటమి ప్రభుత్వం దసరా సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను చెల్లించాలని ఆంధ్ర ప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ ఆర్ వెంకట జనార్దన రెడ్డి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అంకిరెడ్డి, పల్లె మదన్మోహన్ రెడ్డి, బి ఖాదర్ బాషా ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ప్రభుత్వ ఉద్యోగులకు ఎటువంటి మేలు జరగలేదన్నారు. డి ఎ లు పేరుకుపోవడంతోపాటు డి ఎ బకాయిల కోసం ప్రభుత్వ ఉద్యోగులు కోర్టుకు ఎక్కారన్నారు. వెంటనే పెండింగ్ లో ఉన్న మూడు డీఏలను ఈ దసరాకు విడుదల చేయాలన్నారు. పీఆర్సీ కమీషన్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

కడప రూరల్ : ప్రజలందరూ ఆరోగ్యవంతులుగా ఉండాలన్న ఉద్దేశ్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ నోడల్ ఆఫీసర్ పెంచలయ్య పిలుపునిచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పిలుపు మేరకు దేశమంతటా స్వస్థ నారీ సశక్త్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కడప నగరం రాధాకృష్ణనగర్ యూపీఎస్‌సీ ఆధ్వర్యంలో వివిధ అనారోగ్య సమస్యలకు వైద్య సేవలను అందిస్తూ ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని నోడల్ అధికారి పెంచలయ్య ప్రారంభించారు. అనంతరం మహిళలు, చిన్నారులకు వైద్య నిపుణులు పలు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మైదుకూరు పట్టణంలో ఉన్న టీవీఎస్ఎం స్కూల్ కరస్పాండెంట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారని, ఆయనపై చర్యలు తీసుకొని స్కూల్ గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎద్దు రాహుల్, వీరపోగు రవి పేర్కొన్నారు. బుధవారం ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్‌కు ఎస్ఎఫ్ఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నిరుద్యోగుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, ఈ డీఎస్సీలో జరిగినంత గందరగోళం ఏ డీఎస్సీలో జరగలేదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివ కుమార్ విమర్శించారు. బుధవారం నగరంలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ అభ్యర్థుల అనుమానాలను రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలకు కులాల వారిగా కటాఫ్ బహిరంగంగా ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలకు చంద్ర ఎంపిక



కడప వైఎస్ఆర్ సర్కిల్ : సెప్టెంబర్ 21 నుండి 25 వరకు చండీఘర్‌లో జరగనున్న సీపీఐ జాతీయ మహాసభలకు సీపీఐ కడప జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ప్రతినిధిగా హాజరుకానున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభలలో సీపీఐ జాతీయ మహాసభలకు ఎంపిక చేసిన ప్రతినిధులలో జిల్లా నుంచి తనను ఎంపిక చేసినట్లు గాలి చంద్ర తెలిపారు. జాతీయ మహాసభలలో ఆర్థిక, రాజకీయ, సామాజిక అంశాలపై, 11 సంవత్సరాల మోడీ పాలనలో విద్యార్థి, యువజన, శ్రామిక, మహిళ, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలు, ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలు రూపొందించేందుకు మహాసభలు వేదిక కానున్నాయన్నారు.

జర్మన్ భాషా శిక్షణను వినియోగించుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప రిమ్స్‌లో ఉన్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో జర్మన్ భాషా శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ అమలు చేయనుంది. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ శేషాద్రి జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 'జర్మన్ భాషా శిక్షణ విద్యార్థుల భవిష్యత్తుకు కొత్త అవకాశాలు కల్పిస్తుందన్నారు. జర్మనీలో నర్సింగ్ రంగంలో మంచి డిమాండ్ ఉందని, ఈ శిక్షణ ద్వారా విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ అవకాశాలు పొందగలరని తెలిపారు. నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇంతియాజ్ అహ్మద్ మాట్లాడుతూ సుమారు 8–10 నెలల పాటు జర్మన్ భాషా శిక్షణ సర్టిఫైడ్ ట్రైనర్లు అందిస్తారన్నారు.

ఉపాధ్యాయ పోస్టుల అక్రమాలపై విచారణ చేయాలి



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ఎయిడెడ్ పోస్టుల భర్తీ విషయంలో 2024–2025 విద్యా సంవత్సరంలో ఆర్‌సిఎం ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ 24మంది ఉపాధ్యాయ నియామకాలను నిర్వహించే క్రమంలో ప్రభుత్వ ఉత్తర్వులు, జీవోలను పూర్తిగా ఉల్లంఘించారని పీడీఎస్‌యు, ఎఐఎస్‌బి, పీఎస్‌యు నాయకులు అంకన్న, సుబ్బరాయుడు, జయవర్ధన్‌లు ఆరోపించారు. వాటిపై విచారణ జరపాలని కోరుతూ బుధవారం కడప డీఈఓ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీఎస్‌యు, ఎఐఎస్‌బి, పీడీఎస్‌యు, ఏఐఎస్‌బి జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్రప్రసాద్, సురేంద్ర, పండు, శివ, మణికంఠ, సుబ్రహ్మణ్యం, కిషోర్, మహమ్మద్ బాష, శ్రీనివాసులు రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

యూరియా రాయితీ మోసపూరితం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : రైతులకు యూరియా సరఫరా చేయకుండా రాయితీ ఊరింపులా అని ఏపీ రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి ప్రశ్నించారు. బుధవారం నగరంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతాంగానికి అవసరమైనంత యూరియా సరఫరా చేయకుండా దాని వాడకాన్ని తగ్గించుకుంటే రూ.800 రాయితీ ఇస్తామని ప్రభుత్వం ఊరించడం ప్రజలను వంచించడమే అన్నారు. ఇది ఎంత మాత్రం తగదన్నారు.

వక్ఫ్‌పై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం

కడప కార్పొరేషన్ : వక్ఫ్ సవరణ చట్టం 2025 పై సుప్రీం ధర్మాసనం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ముస్లిం సమాజం స్వాగతిస్తోందని వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి మున్నా అన్నారు. ఆయన బుధవారం ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. వక్ఫ్ సీఈవో పదవి సాధ్యమైనంతవరకూ ముస్లింలకే ఇవ్వాలని కోర్టు సూచించిందన్నారు. అలాగే వక్ఫ్ ఆస్తులపై వివాదాలు తలెత్తినప్పుడు నిర్ణయాధికారం కలెక్టర్లకు కట్టబెట్టడాన్ని కూడా సుప్రీం నిలువరించిందన్నారు. వక్ఫ్ కౌన్సిల్, స్టేట్ వక్ఫ్ బోర్డుల్లో మెజార్టీ సంఖ్య ముస్లింలే ఉండాలని కూడా సుప్రీం చెప్పడం హర్షణీయమన్నారు.

వైద్య విద్యను దూరం చేస్తున్న ప్రభుత్వం

కడప వైఎస్ఆర్‌సర్కిల్ : కూటమి ప్రభుత్వం పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తున్నదని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు ఎల్.చంద్ర, అరుణ్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 10 ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఈ అనాలోచిత నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా సమితి సభ్యులు మల్లికార్జున రెడ్డి, నాయకులు జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీని నిరూపించుకున్న న్యాయవాది



కడప వన్‌టౌన్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డికి సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న న్యాయవాది వినయ్‌కుమార్

కడప అర్బన్ : నందలూరు కోర్టులో పనిచేస్తున్న న్యాయవాది వి. వినయ్ కుమార్ తమ నిజాయితీని నిరూపించుకున్నారు. ఈనెల 16వ తేదీ రాత్రి రైల్వే స్టేషన్ నుంచి కడప అంబేద్కర్ సర్కిల్ వరకు ఆటోలో న్యాయవాది వినయ్ కుమార్ ప్రయాణించారు. అదే సమయంలో ఓ సెల్ ఫోన్ ఆటోలో కనిపించింది. వెంటనే ఎవరో సెల్‌ఫోన్ మర్చిపోయి వెళ్లారని వినయ్ కుమార్ భావించి ఆ సెల్ ఫోను సు తనతో పాటు గా తీసుకుని వెళ్లారు. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తి ఉదయం వరకు ఫోన్ చేయకపోవడంతో బుధవారం ఉదయం కడప వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లోని ఎస్ఐ ప్రతాపరెడ్డికి ఆ ఫోన్ అప్పగించారు. తర్వాత పోలీసులు విచారించగా అది ఓ పాఠశాల కరస్పాండెంట్‌కు చెందిందని నిర్ధారించి ఆయనకు అప్పగించారు. న్యాయవాది వినయ్ కుమార్ నిజాయితీకి పోలీసు అధికారులు, సహచర న్యాయవాదులు అభినందించారు.

షరతుల్లేకుండా ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం చేయాలి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీయూసీ నాయకులు

కడప కార్పొరేషన్ : ఎలాంటి షరతులు లేకుండా ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుదర్శన్ రాయల్, జిల్లా అధ్యక్షుడు ఎం. జాషువా, నగర అధ్యక్షుడు ఏ1 నాగరాజు డిమాండ్ చేశారు.

బుధవారం జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వాహన మిత్ర పథకం ద్వారా ఆటో, క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు ఆర్థిక సాయం అందించారని, దీనిద్వారా వాహనాలకు మరమ్మతులు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్స్యూరెన్స్ చేయించుకుంటారనే ఉద్దేశ్యంతో సాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16నెలలు పూర్తయినా ఆటో కార్మికుల గూర్చి పట్టించుకోలేదన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో ఎక్కేవారే కరువయ్యారన్నారు. ఈ నేపథ్యంలో ఆటో కార్మికులకు గత ప్రభుత్వం కంటే ఎక్కువగా రూ.15వేలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారన్నారు. అయితే ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్స్యూరెన్స్ పొల్యూషన్ సర్టిఫికెట్, ఇన్‌కం, క్యాస్ట్ సర్టిఫికెట్లు వంటివి ఖచ్చితంగా ఉండాలనే నిబంధన విధించడం అన్యాయమన్నారు. ఇవన్నీ చేయించుకోవాలంటే కనీసం రూ.15వేల వరకూ ఖర్చు అవుతుందని, ఆటో కార్మికుల నుంచి తీసుకొని, మళ్లీ వారికే ఇవ్వాలనే ఈ కుతంత్రాన్ని విరమించుకోవాలన్నారు. సొంత ఆటో, క్యాబ్ కలిగిన వారికి గత ప్రభుత్వం ఎలాంటి షరతుల్లేకుండా ఆర్థిక సాయం చేసిందని, ఈ ప్రభుత్వం కూడా అలాగే చేయాలన్నారు. అలాగే దరఖాస్తు చేసుకోవడానికి రెండు రోజులే సమయం ఇవ్వడం ద్వారా అర్హులను తగ్గించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. అన్ని సర్టిఫికెట్లు తీసుకొని ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి కనీసం నెల రోజులు సమయం ఇవ్వాలని కోరారు. ఆటో కార్మికులపై ట్రాఫిక్ పోలీసులు విధించే జరిమానాలు కూడా ఎక్కువగా ఉంటున్నాయని, ఆటో ఫైనాన్స్ వారి ఇబ్బందులు తట్టుకొని ఈ జరిమానాలు చెల్లించడం చాలా కష్టంగా ఉందన్నారు. ఆటో కార్మికుల పట్ల ప్రభుత్వం మానవత్వం చూపాలని కోరారు. ఈ సమస్యలన్నీ పరిష్కరించకపోతే వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు వెంకట్రావ్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటిన నగరపాలక ఉద్యోగులు



అటెండర్ కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న నగరపాలక ఉద్యోగులు

కడప కార్పొరేషన్ : కడప నగరపాలక సంస్థ ఉద్యోగులు మానవత్వం చాటుకున్నారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అటెండర్‌కు చికిత్స కోసం రూ.1.50లక్షలు ఆర్థిక సాయం చేశారు. వివరాలిలా ఉన్నాయి. కడప కార్పొరేషన్‌లో అడిషనల్ కమిషనర్ అటెండర్‌గా పనిచేస్తున్న యస్. మణికంఠ మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బ్లడ్ హ్యామరేజ్ వలన తిరుపతిలో అత్యవసర ప్రథమ చికిత్స పొందుతున్న ఆయనకు నగర పాలక సంస్థ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు అందరు కలిసి రూ.1.50లక్షలు ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహోద్యోగి ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నీకు మేమంతా ఉన్నాం.. అంటూ భరోసా కల్పిస్తూ సహాయం చేసిన ప్రతి ఉద్యోగికి ఎంప్లాయిస్ యూనియన్ తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ యం.రాజశేఖర్, సీనియర్ అసిస్టెంట్లు శ్రీరాములు, పి. విశ్వనాథ రెడ్డి, లూకరాజు, జి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడే యూటీఎఫ్ రణభేరి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు

కడప ఎడ్యుకేషన్ : సెప్టెంబర్ 15 నుండి 19 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న రణభేరి కార్యక్రమం గురువారం సాయంత్రం కడపలోకి ప్రవేశిస్తుందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు తెలిపారు. బుధవారం సాయంత్రం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధ నేతర కార్యక్రమాలు రద్దు చేయాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని, అస్తవ్యస్తంగా పునర్వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిదిద్దాలని డిమాండ్ చేశారు. పేరుకుపోయిన వేలకోట్ల ఆర్థిక బకాయిలను చెల్లించాలని, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. పలు సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ రణభేరి ప్రచార బైక్ జాతా నిర్వహిస్తున్నదని తెలిపారు. గురువారం సాయంత్రం ఐదు గంటలకు ప్రచార జాతతో పాటు బైక్ జాత కడప వై జంక్షన్ నుండి అంబేద్కర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, సంధ్యా సర్కిల్, ఎర్రముక్కపల్లి సర్కిల్ మీదుగా బాలాజీ నగర్ లోని యూటీఎఫ్ భవన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని బైక్ జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహమ్మద్ నాయకులు గాజులపల్లి గోపీనాథ్, రామకేశవ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



రక్తహీనతపై సూచనలిస్తున్న ఐసీడీఎస్ పీడీ రమాదేవి

కడప కోటిరెడ్డిసర్కిల్ : గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనత బారిన పడకుండా తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ రమాదేవి సూచించారు. బుధవారం కడప నగరంలోని మోచంపేట సెక్టార్‌లో 8వ రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16 వరకు పోషణ మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్‌వైజర్లు, సీడీపీఓలు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి రక్తహీనత బారిన పడిన వారికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ వాణి, ఐటీసీ స్వరూప, సూపర్‌వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి



దర్గా ప్రార్థనల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కడప నియోజకవర్గంలో ప్రజలంతా సుఖ సంతోషాలంతో సుభిక్షంగా ఉండాలని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష ప్రార్థించారు. మంగళవారం రాత్రి 39వ డివిజన్ హజరత్ రకీబ్ షా వలీ దర్గాలో ఉరుసు మహోత్సవంలో పాల్గొని పూల ఛాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలంతా కులమతాలకు అతీతంగా ఐక్యతతో మెలగాలని, వారు కోరుకున్న కోర్కెలు తీరాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎస్ఎండీ షఫీ, షంషీర్, అజ్మతుల్లా, పార్టీ నాయకులు పవర్ అల్తాఫ్, అలీ అక్బర్, చాక్లెట్ గౌస్, జమీల్, మియ్యా, సమీర్, పీరు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చెల్లించి ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందేలా చూడాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 33 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు దాదాపు 70 కోట్ల రూపాయలు నిధులు చెల్లించాల్సి ఉందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా లబ్ధి పొందే వారందరూ పేదలేనని, అలాంటి పేదలకు వైద్యం సకాలంలో అందించడంలో ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వం మీద ఉందన్నారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దస్తగిరిరెడ్డి, నగర కమిటీ సభ్యులు చంద్రారెడ్డి, పార్టీ నగర నాయకుడు నరసింహ పాల్గొన్నారు.

ఆరోగ్య సేవలను బలోపేతం చేయడమే లక్ష్యం



శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు

చింతకొమ్మదిన్నె : స్వస్థ నారి సశక్త్ పరివార్ అభియాన్ అనే కార్యక్రమాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. వివిధ విభాగాల ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు, జిల్లా ఎపిడమియాలజిస్ట్ ఖాజా, సహాయ మలేరియా అధికారి వెంకటరెడ్డిలు శిబిరం నిర్వహణను పరిశీలించారు. కార్యక్రమ పర్యవేక్షణను రాష్ట్ర ప్రతినిధులు డాక్టర్. పెంచలయ్య, డాక్టర్ సుప్రీతలు ఆకస్మిక తనిఖీ నిర్వహించి, రాష్ట్ర కార్యాలయానికి నివేదిక పంపనున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్టాటిస్టికల్ అధికారి రమేష్‌రెడ్డి, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ బాలాంజనేయులు, జిల్లా ఆరోగ్య పర్యవేక్షకులు రాఘవ, రాష్ట్ర ప్రతినిధులను అనుసరించి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. శిబిరంలో దాదాపు 243 మందికి వివిధ ఆరోగ్య వైద్య సేవలు అందించామన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ పర్యవేక్షకులు శ్రీదేవి, లక్ష్మీదేవి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, పాల్గొన్నారు.